క్లుప్తంగా

అయోడిన్ లోపిస్తే థైరాయిడ్



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కూర్మా నాయకులు

కర్నూలు (హాస్పిటల్) : వ్యాపారస్తులు తప్పని సరిగా అయోడిన్ ఉన్న ఉప్పునే విక్రయించాలని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కూర్మా నాయకులు చెప్పారు. ప్రపంచ అయోడిన్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ఓల్డ్‌టౌన్‌లో ఉప్పు విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూర్మా నాయకులు మాట్లాడుతూ శరీరంలో అయోడిన్ లోపిస్తే థైరాయిడ్ వ్యాధి వస్తుందన్నారు. కావున ప్రజలు అయోడిన్ ఉప్పుతో పాటు అయోడిన్ అధికంగా ఉండే దానిమ్మ, స్ట్రాబెర్రీ, పెరుగు, బంగాళాదుంప వంటి ఆహారాలను తీసుకోవాలన్నారు. సమావేశంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ టి.రాజగోపాల్, ఎస్.రాముడు, వ్యాపారులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేస్తే నేరం



మాట్లాడుతున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భస్థ లింగనిర్ధారణ చేయడం నేరమని పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీలో ప్రభుత్వ, ప్రైవేటు స్కానింగ్ కేంద్రాల వైద్యులకు పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ అమలు, ఆడ పిల్లల సంరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు పాటించాల్సిన నియమ నిబంధనలు, నిర్వహించాల్సిన రికార్డులు, పీసీ పీఎన్‌డీటీ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సిన ఫారం–ఎఫ్ గురించి వివరించారు. సమావేశంలో డెమో ప్రమీలాదేవి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఈ పద్మావతి, పీసీ పీఎన్‌డీటీ ప్రోగ్రామ్ కన్సల్టెంట్ సుమలత, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

మిసెస్ క్వీన్ ఆఫ్ ఇండియా రన్నరప్‌గా శోభా లిఖిత



మిసెస్ క్వీన్ కిరీటాన్ని అందుకుంటున్న శోభాలిఖిత (ఫైల్)

కర్నూలు(హాస్పిటల్): న్యూ ఢిల్లీలో ఇటీవల యూఎన్‌బీ సంస్థ నిర్వహించిన మిసెస్ ఎలైట్ క్వీన్ ఆఫ్ ఇండియా ఫైనల్ పోటీల్లో రన్నరప్‌గా బి. శోభాలిఖిత(51) ఎంపికయ్యారు. ఈమె కర్నూలుకు చెందిన సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ బి. శేషన్న కుమార్తె. 51 ఏళ్ల క్రితం శ్రీశైలం ప్రాజెక్టు వెస్ట్ వద్ద ఆమె జన్మించారు. ఐఎఫ్ఎస్ ఆఫీసర్ జె.ప్రసాద్‌ను వివాహం చేసుకున్న అనంతరం ఆమె హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తాజాగా న్యూఢిల్లీలో నిర్వహించిన పోటీల్లో ఎలైట్ కేటగిరి(40 నుంచి 55 ఏళ్ల వయస్సు)లో 70 మంది పాల్గొనగా ఆమె రన్నరప్‌గా నిలిచారు.

సెలవుల్లో టీపీఎస్

కర్నూలు (టౌన్): నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న టి. హరీష్ చౌదరి నెల రోజుల పాటు సెలవుల్లో వెళ్లారు. వచ్చే నెల 24 వ తేదీ తిరిగి విధులకు హాజరు కానున్నారు. దీంతో ఆయన స్థానంలో 14 నుంచి 24 వార్డు, 28 వ వార్డు అలాగే 42 నుంచి 53 వార్డులకు ఇన్‌చార్జులుగా శబరీష్, మంజులమ్మలకు బాధ్యతలు అప్పగిస్తూ నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

30న ప్రత్యేక పూజలు

కర్నూలు కల్చరల్: కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈనెల 30వ తేదీ స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు.

పార్కింగ్ స్థలాలకు వేలాలు



పార్కింగ్ స్థలాలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

కర్నూలు (టౌన్) : నగరపాలక పరిధిలోని రెండు చోట్ల పార్కింగ్ స్థలాలకు శుక్రవారం వేలాలు నిర్వహించారు. ఖానా ఖజానా పార్కింగ్ స్థలాన్ని రూ. 50 వేలకు పి. హరి స్వరూప్ రెడ్డి, గుత్తి రోడ్డు వద్ద పార్కింగ్ స్థలాన్ని రూ. 70 వేలకు డి. మహబూబ్ బాషాకు అప్పగించారు. కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ నగరపాలక నిర్ణయించిన ధరల ప్రకారం వినియోగదారుల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు జునీద్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే నాణ్యమైన వైద్యం







శిబిరంలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మందులు అందజేస్తున్న మేయర్ బీవై రామయ్య, 43వ వార్డులో ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న తెర్నేకల్ సురేంద్రారెడ్డి

- ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం
- కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్
- 4 వ వార్డులో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కర్నూలు (టౌన్): ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజల వద్దకే నాణ్యమైన వైద్యాన్ని తీసుకొచ్చిందని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక 4 వ వార్డు కుమ్మరి గేరిలోని వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మెడికల్ క్యాంపును ఎమ్మెల్యే ప్రారంభించారు. అక్కడ వృద్ధులు, మహిళలను పలకరించి ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నగరంలో సచివాలయాల వారీగా 45 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, మూత్ర, మలేరియా, డెంగీ, కంటి తదితర పరీక్షలను ఉచితంగా చేయడంతో పాటు అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు అందజేస్తారన్నారు. దేశ చరిత్రలో ఇలాంటి కార్యక్రమం ఎక్కడా జరగలేదన్నారు. కార్యక్రమంలో 4 వ వార్డు కార్పొరేటర్ ఆర్షియా పర్వీన్, వార్డు నాయకులు రియాజ్‌బాబా, క్లస్టర్ ఇన్‌చార్జ్ మహబూబ్‌బాషా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

43 వ వార్డులో వైద్య శిబిరాన్ని పరిశీలించిన జేసీఎస్ కో ఆర్డినేటర్

స్థానిక ఇందిరాగాంధీనగర్‌లోని డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జేసీఎస్ కోఆర్డినేటర్ తెర్నేకల్ సురేంద్రారెడ్డి ఈ వైద్య శిబిరాన్ని సందర్శించి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి రూ. కోట్లు ఖర్చు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ నాగ సౌమ్య రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ మల్లికార్జున, సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(హాస్పిటల్): అనారోగ్య సమస్యలున్న వారు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత చెప్పారు. శుక్రవారం స్థానిక బండిమెట్ట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కుమ్మరిగేరిలో సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హకీం రషీద్, కార్పొరేటర్ అర్షియా ఫర్వీన్, డాక్టర్ అపర్ణ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మేయర్ పరిశీలించారు. అక్కడ ప్రజలకు కల్పించిన సౌకర్యాలను, వసతులను పరిశీలించి, వైద్య సేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైద్యం అందక ఎవరూ ఇబ్బంది పడకుడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. దీంతో ప్రజల చెంతకే వైద్యం అందుతుందన్నారు. డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రాన్స్ అండ్ ఫిష్ ఫెస్టివల్‌ను విజయవంతం చేద్దాం

- మంత్రి గుమ్మనూరు జయరాం
- పోస్టర్లు విడుదల చేసిన మంత్రి, పాణ్యం, ఆదోని ఎమ్మెల్యేలు, ఆదోని సబ్ కలెక్టర్



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు(అగ్రికల్చర్): రాయలసీమ స్థాయిలో కర్నూలులో నవంబరు నెల 3,4,5 తేదీల్లో నిర్వహించే ఫ్రాన్స్ అండ్ ఫిష్ ఫెస్టివల్‌ను విజయవంతం చేద్దామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతానికి ప్రత్యేక దృష్టి సారించాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఫ్రాన్స్ అండ్ ఫిష్ ఫెస్టివల్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనేక పోషకాలకు నెలవైన చేపలు, రొయ్యల వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఫెస్టివల్‌ను రాయలసీమ స్థాయిలో పెద్ద ఎత్తున నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్యామల మాట్లాడుతూ.. ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే ఫ్రాన్స్, ఫిష్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ వేర్వేరుగా ఫిష్ ఫెస్టివల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

పోలీసులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



పోలీస్ పరేడ్ మైదానంలో 5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్ఐ పోతల రాజు

కర్నూలు: పోలీసులు స్వీయ క్రమశిక్షణతో రోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఎస్పీ ఆధ్వర్యంలో ఏఆర్ పోలీసు సిబ్బంది జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో శుక్రవారం 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ఆరోగ్యంగా, శారీరకంగా బలంగా ఉన్నప్పుడే ప్రజలకు మెరుగైన సేవలందిస్తారని చెప్పారు. ఈ ఉద్దేశంతోనే 5కే రన్ నిర్వహించామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగబాబు, డీఎస్పీ ఇలియాజ్ బాషా, ఆర్ఐలు పోతల రాజు, వి.ఎస్.రమణ, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

రెండో పటాలంలో ఆయుధాల ప్రదర్శన



ఆయుధాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బెటాలియన్స్ డీఐజీ

కర్నూలు: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలంలోని ఆయుధాగారంలో ఆయుధాల ప్రదర్శన (ఓపెన్ హౌస్) నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీఎస్పీ బెటాలియన్స్ మూడో రేంజ్ డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పటాలంలోని ఆయుధాగారంలో ఉన్న అత్యాధునిక ఆయుధాలను ప్రదర్శనలో ఉంచి వాటి వినియోగంపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రకృతి విపత్తుల సమయంలో తమను తాము ఎలా రక్షించుకోవాలో అనేదాని గురించి ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ఈ సందర్భంగా డ్రిల్ నిర్వహించారు. ఎస్‌డీఆర్ఎఫ్ ఆర్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగరంలోని భాష్యం, ఎస్పీవీఎన్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, శ్రీలక్ష్మీ స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. ఆయా ప్రదర్శనలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పటాలంలో నిర్వహించనున్న కార్యక్రమాల గురించి డీఐజీ వెంకటేశ్వర్లు.. బెటాలియన్ ఇన్‌చార్జి అదనపు కమాండెంట్ మహబూబ్ బాషాను అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసరావుతో పాటు రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాసుపత్రికి వైద్యపరికరాల విరాళం



బాయిల్ ఆపరేటర్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఆపరేషన్ థియేటర్లకు దాతలు పలు రకాల వైద్య పరికరాలు విరాళంగా ఇచ్చారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో రెండు బాయిల్ ఆపరేటర్స్, ఒక ఆపరేషన్ థియేటర్ లైట్ ఇచ్చారు. అలాగే అయ్యపురెడ్డి అనే వ్యక్తి రెండు ఆపరేషన్‌థియేటర్ టేబుల్స్ అందజేశారు. వీటిని ఏ అండ్ బీ ఓటీలు, ప్లాస్టిక్ సర్జరీ ఓటీ, గైనిక్ ఓటీ, ఎమర్జెన్సీ ఓటీలలో ఏర్పాటు చేశారు. వీటి వల్ల ఆయా ఆపరేషన్ థియేటర్లు మరింత సవ్యంగా నడిచేందుకు అవకాశం ఏర్పడిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. కేథలాబ్ మిషన్ ఏర్పాటు పనులు వేగంగా సాగుతున్నాయని, వారం రోజుల్లో దీనిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ హరిచరణ్, అనెస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ విశాల, డాక్టర్ కొండారెడ్డి, డాక్టర్ మహేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఏర్పాటు

కర్నూలు(హాస్పిటల్): త్వరలో కర్నూలు మెడికల్ కాలేజి, ప్రభుత్వ ఆసుపత్రిలో గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఏపీ(జీడీ ఆప్)ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ అంశంపై శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017లో ఈ సంఘం ఏర్పాటైందన్నారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 800 మంది, కర్నూలు మెడికల్ కాలేజిలో 167 మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. ఇంకా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మురం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వైద్యుల సమస్యలు, పదోన్నతులు, అరియర్స్ గురించి రాష్ట్ర ప్రభుత్వానికి తమ సంఘం ఆధ్వర్యంలో విన్నవిస్తామని చెప్పారు.

అవీ-ఇవీ

దివ్యాంగులకు కృత్రిమ చేతుల పంపిణీ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని శారీరక దివ్యాంగులకు మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కృత్రిమ చేతుల శిబిరాన్ని ఈ ఏడాది డిసెంబర్ 10వ తేదీన నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన దివ్యాంగులు మోచేయి కింద కనీసం 4 అంగుళములు చేయి కలిగిన వారు ముందస్తుగా సెల్: 7207403150 నంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

రేపు ఉచిత మెడికల్ క్యాంప్

కర్నూలు(అగ్రికల్చర్): విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఈ నెల 29న రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, కర్నూలు ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లుగా జిల్లా శాఖ అధ్యక్షుడు, రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు రంగారెడ్డి తెలిపారు. అబ్బాస్ నగర్‌లోని ఎస్‌సీబీ పార్కులో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9441802262 నంబరుకు ఫోన్ చేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

29న'అమెరికాఅల్లుడు' హాస్య నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీ సాయంత్రం 7 గంటలకు 'అమెరికా అల్లుడు' హాస్య నాటక ప్రదర్శనను సీక్యాంప్‌లోని కళాక్షేత్రంలో ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు.

పొదుపు సంఘాల పటిష్టతపై దృష్టి

కర్నూలు(అగ్రికల్చర్): స్వయం సహాయక సంఘాల పటిష్టతపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా తెలిపారు. సంఘాల్లోని పొదుపు మహిళలందరు వివిధ వృత్తులను అభివృద్ధి చేసుకొని ఆర్థికంగా రాణించే విధంగా చూడాలని పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ–వైకేపీ కార్యాలయంలో ఓర్వకల్, వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు తదితరులతో నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడుతూ... మండలాల వారీగా మహిళల జీవనోపాధుల అభివృద్ధిని ఆరా తీశారు. సమావేశంలో అడిషినల్ పీడీ శ్రీధర్‌రావు, డీపీఎంలు రెహిమాన్, అయ్యమ్మ, నరసమ్మ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలకు అతీతంగా సేవలు

కర్నూలు కల్చరల్: రాజకీయ పార్టీలకు అతీతంగా ఆర్యవైశ్య మహా సభ సేవలు అందిస్తున్నామని మహాసభ గౌరవ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ సూచించారు. శుక్రవారం తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గానికి ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా టీజీ మాట్లాడుతూ వసతి గృహాల్లో ఆర్యవైశ్యులు మాత్రమే కాకుండా ఇతర సామాజిక వర్గాలకు అవకాశం కల్పిస్తోందన్నారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు నిర్వహించి ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గంలో అన్ని జిల్లాలకు సమాన ప్రాతినిథ్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో మహాసభ గౌరవాధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, అధ్యక్షులు చిన్న రామసత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి షణ్ముఖరావు, కోశాధికారి శీను, ఉపాధ్యక్షుడు విట్టా రమేష్, చీమకుర్తి బద్రీనాథ్ పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

కర్నూలు(సెంట్రల్): సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ సాయంత్రం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నగర కమిటీ కార్యదర్శి టి.రాముడు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆ పార్టీ నాయకులు దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించారు. నగరంలోని రెండో వార్డులో డి.పార్వతయ్య ఆధ్వర్యంలో, 15వ వార్డు బుధవార పేటలో ఆర్‌కృష్ణ, కె.రాముడు ఆధ్వర్యంలో, 32,33 వార్డుల్లో కె.సుధారప్ప, 23వ వార్డు శ్రీరామ నగర్‌లో ఆర్ నరసింహులు ఆధ్వర్యంలో, 45,46 వార్డుల్లో టి.రాముడు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

ఈ రోజు

మూత్రాశయ క్యాన్సర్‌పై సీఎంఈ

కర్నూలు(హాస్పిటల్): మూత్రాశయంలో వచ్చే క్యాన్సర్ గురించి ఈ నెల 28వ తేదీన నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు (సీఎంఈ) నిర్వహించనున్నట్లు కర్నూలు మెడికల్ కాలేజి యురాలజి హెచ్‌ఓడీ డాక్టర్ సీతారామయ్య తెలిపారు. కళాశాలలోని క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌కు చెందిన సీనియర్ యూరో అంకాలజిస్టు డాక్టర్ రాకేష్ శర్మ, కర్నూలు మెడికల్ కాలేజికి చెందిన డాక్టర్ సేపూరి బాలరవితేజ, డాక్టర్ ప్రకాష్, డాక్టర్ సుధీర్‌కుమార్ బ్లాడర్‌లో క్యాన్సర్ చికిత్సల అప్‌డేట్స్ గురించి వివరిస్తారన్నారు.

దామోదర కార్తీక మాస దీపోత్సవాలు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక పూరీ జగన్నాథ మందిరంలో శనివారం నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు దామోదర కార్తీక మాస దీపోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ చైతన్య ప్రభు తెలిపారు.

చంద్రగ్రహణం

కర్నూలు కల్చరల్: ఆదివారం తెల్లవారు జామున 1.05 గంటల నుంచి 2.25 గంటల వరకు రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణం సంభవించనుంది. చంద్రగ్రహణం నేపథ్యంలో జిల్లాలోని ఆలయాలు శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు మూసి వేయనున్నారు.

స్పోర్ట్స్

29న మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 29 వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎర్రగుంట్ల రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 35 సంవత్సరాల నుంచి 95 సంవత్సరాల వయస్సు ఉన్న అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఇందులో ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్ ఉంటాయని తెలిపారు. పాల్గొన దలచిన వెంట ఆధార్ కార్డు, ఎంట్రీ ఫీజుతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9985552896 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పాడి-పంట

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయ సాగును ప్రోత్సహించాలని కర్నూలు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం కర్నూలు ఏ.క్యాంపులోని ఉద్యాన భవన్‌లో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పనిచేస్తున్న రైతు శాస్త్రవేత్తలు, మెంటర్స్ తదితరులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులకు అవకాశం ఉందని వివరించారు. కెమికల్స్ లేకుండా పండించే పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. సీనియర్ అసోసియేట్స్ డాక్టర్ వరలక్ష్మి, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సందీప్‌కుమార్, డిస్ట్రిక్ట్ పాయింట్ పర్సన్స్ శ్వేత, సలీమ్, మల్లికార్జున ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థన



కర్నూలు(అర్బన్): నగరంలోని జొహరాపురం హజరత్ సయ్యద్ అల్లాహ్ బకాష్ ఖాద్రి దర్గాలో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా పీఠాధిపతులు షరీఫ్ పాషా, అన్సర్ పాషా, అన్వర్ పాషా, సయ్యద్ నూరే రహత్ పాషా ఖాద్రితో కలసి ఆయన దర్గాలో సలామ్, దువా, ఫాతేహా కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డు కార్పొరేటర్ పల్లవి, నాయకులు అక్బర్, చందు, సూర్యమోహన్, నాగేంద్ర, చెన్నమ్మ, లేపాక్షి, చిన్నబాబు, విజయలక్ష్మి, రమేష్, గారీబా, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి

- జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్) : జాతీయ రహదారులపై ప్రమాదాలు జరకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జాతీయ రహదారి 44లో ఆదర్శ మారుతి షోరూం, గోశాల దగ్గర రంబుల్ స్ట్రిప్స్, ఐరన్ బారికేడ్లను త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. నగరంలోని కేంద్రీయ విద్యాలయం సమీపంలో ఉన్న స్పీడు బ్రేకర్లను వాహనదారులు గుర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. జాతీయ రహదారిపై పదిరోజుల్లో హైమాస్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. బళ్లారి చౌరస్తా, రాజ్‌విహార్ సర్కిళ్లలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాటిని సీజ్ చేయాలని, అవసరమైతే బండి నడిపిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. నగరంలో పలు చోట్ల బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని, ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ఆర్అండ్‌బీ అధికారులు వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డీటీసీ శ్రీధర్ మాట్లాడుతూ..కేంద్ర రోడ్లు మరియు రవాణా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ప్రమాదంలో ఎవరైన మరణిస్తే రూ.2 లక్షలు, గాయపడితే రూ.50 వేలు అందజేస్తామన్నారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన 6మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీఓ రమేష్, ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణంతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గొలుసు దొంగల హల్‌చల్

కర్నూలు: నగరంలోని వేర్వేరు కాలనీల్లో రెండు గంటల వ్యవధిలో రెండు చోట్ల చైన్ స్నాచింగ్‌కు ప్రయత్నించి హల్‌చల్ సృష్టించారు. ఎఫ్‌సీఐ కాలనీ పక్కన ఉన్న కిసాన్ నగర్‌లో కలెక్టరేట్ కార్యాలయ ఉద్యోగి రాజేశ్వరమ్మ నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు యువకులు నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలోని గొలుసును లాక్కునేందుకు ప్రయత్నించారు. ఆమె ప్రతిఘటించి కేకలు వేయడంతో దొంగలు అక్కడినుంచి పరారయ్యారు. అలాగే గణేష్ నగర్–2లో జంపాల అపార్ట్‌మెంట్ దగ్గర ఉపాధ్యాయురాలు నిర్మలమ్మ నడుచుకుంటూ వెళ్తుండగా దొంగలు మెడలోని గొలుసును లాక్కునేందుకు ప్రయత్నించగా ఆమె పూర్తిగా రోడ్డు దిగి కిందకు వెళ్లిపోవడంతో దొంగల ప్రయత్నం విఫలమైంది. విషయం తెలిసిన వెంటనే మూడో పట్టణ క్రైం పార్టీ పోలీసులు ఆయా ప్రాంతాలకు చేరుకుని దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టడమే కాక మహిళలను అప్రమత్తం చేశారు.

మెడికో ఆత్మహత్య

హిందూపురం అర్బన్: తరచూ ఇబ్బంది పెడుతున్న మూర్ఛవ్యాధి భరించలేక ఓ మెడికో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే...హిందూపురం రూరల్ సీఐ వేణుగోపాల్ డీఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆయన కుమారుడు, కుమార్తె సంతానం. కుమారుడు ఆర్ఎన్. సూర్య చంద్ర(22) కుప్పంలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మూర్ఛవ్యాధితో బాధపడుతుండటంతో కుటుంబీకులు హిందూపురం తీసుకువచ్చి బెంగళూరులో చికిత్స చేయిస్తున్నారు. అయినప్పటికీ వ్యాధి నయం కాకపోవడంతో శుక్రవారం ఉదయం ఇంట్లోని తన గదిలో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా...పరీక్షించిన వైద్యులు అప్పటికే సూర్యచంద్ర మృతి చెందినట్లు తెలిపారు. మూర్ఛ వ్యాధితో కలిగే ఇబ్బందులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు హిందూపురం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని స్వగ్రామం కర్నూలుకు తీసుకెళ్లారు.

పెస్టిసైడ్స్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కోడుమూరులోని రామలింగేశ్వర ఎరువుల అంగడి, నంద్యాల జిల్లా రుద్రవరం మండలంలోని ఆలమూరు గ్రామంలో ఉన్న లక్ష్మీ వెంకటేశ్వర ఎరువుల అంగడిలో తనిఖీలు చేసి అనుమతి లేని ప్రదేశాల్లో అమ్ముతున్న రూ.13,35,240 విలువ గల వివిధ కంపెనీలకు చెందిన క్రిమిసంహారక మందులను సీజ్ చేశారు. సెక్షన్ 21 ఆఫ్ ఇన్‌సెక్టిసైడ్ యాక్ట్ 1968 ప్రకారం రెండు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్స్ వ్యవసాయ అధికారి రూఫస్ రోనాల్డ్, తహసీల్దార్ నారాయణ, సీఐలు నాగరాజు యాదవ్, రామకృష్ణ, ఎస్ఐ హనుమంతయ్య, సంబంధిత వ్యవసాయ అధికారులు శ్రీకృష్ణ, రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ అధికారుల దాడులు

కర్నూలు (న్యూసిటీ) : డోన్, ప్యాపిలి, ఉల్లిందకొండ ప్రాంతాల్లో అక్రమంగా నాపరాయి, గ్రావెల్, డోలమైట్ పౌడర్‌ను రవాణా చేస్తున్న మూడు వాహనాలను గురువారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించి పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. వాహనదారులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించనున్నట్లు వెల్లడించారు.